జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు






సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.

శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో

సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| శనివారం 30 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 362 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఇబ్బందులను సత్వరమే పరిష్కరించండి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 30, ప్రతినిధి: మహాత్మా జ్యోతిబా ఫూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగజీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎదురవుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, తెగల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మహనీయుల విగ్రహాలు కేవలం శిల్పాలు కావని, అవి సామాజిక చైతన్యానికి, స్వాభిమానానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీకలని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎదురవుతున్న ఇబ్బందులపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ప్రతినిధులు స్థల సమస్యలు, అనుమతుల జాప్యం, స్థానిక అభ్యంతరాలు, పోలీసు అనుమతులు, రెవెన్యూ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి మహనీయుల ఆశయాలను గ్రామస్థాయి నుంచి యువతలోకి తీసుకెళ్లే ప్రక్రియలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విగ్రహాల ప్రతిష్ఠాపనలో ఎలాంటి అనవసర జాప్యం జరగకుండా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్థలాల విషయంలో ముందుగానే సంబంధిత సంఘాలకు స్పష్టమైన నోటీసులు ఇవ్వాలని, చివరి నిమిషంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, దళిత సంఘాలతో చర్చించి ముందస్తు పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అనవసరంగా దళిత సంఘాల నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని స్పష్టం చేసిన మంత్రి, సమస్యల పరిష్కారంపైనే ప్రధాన దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేస్తోందని, మహనీయుల ఆశయాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు, దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 30, ప్రతినిధి: పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి కీలక సూచనలు చేశారు. రానున్న 40 నుంచి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాకుండా భవిష్యత్ తరాలకు అనుకూలంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే స్థానిక పరిస్థితులను బట్టి 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలని, పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని అదే ప్రాంతంలో ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్టీఐ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించిన సమాచార కమిషనర్లు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 30, ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని జూబ్లీహిల్స్ నివాసంలో రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, సమాచార కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాస్, దేశాల భూపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టి యేడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర సమాచార హక్కు చట్టం అమలు, ఆర్టీఐ కార్యకలాపాలు, ప్రజలకు సమాచార హక్కు అందుబాటులోకి తీసుకురావడంలో చేపట్టిన చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తోందని, పారదర్శక పాలనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా కమిషనర్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, పెండింగ్ అప్పీలు పరిష్కారం, విభాగాల సమన్వయంపై కూడా ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు.




## దేశంలోనే యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నంబర్ వన్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 30, ప్రతినిధి: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర సాగునీటి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇది దేశవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం యాసంగి ధాన్యం కొనుగోళ్లలో సుమారు 60 శాతం వాటా అని పేర్కొన్నారు. సీజన్ ముగిసే నాటికి ఈ వాటా 75 శాతానికి చేరుకునే అవకాశముందని వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ నుంచి 52 లక్షల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే కొనుగోలు చేయడానికి అంగీకరించినప్పటికీ రాష్ట్రం ఇప్పటికే 60 లక్షల మెట్రిక్ టన్నుల మార్కును దాటిందన్నారు. రైతుల ఉత్పత్తి సామర్థ్యానికి, కాంగ్రెస్ ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతకు ఇది నిదర్శనమని తెలిపారు. యాసంగి 2025-26 సీజన్‌లో రాష్ట్రంలో 64.36 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 141 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, సుమారు 13 వేల రవాణా వాహనాలు, రెండు లక్షల మందికి పైగా సిబ్బందిని వినియోగించి కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు కనీస మద్దతు ధర కింద రూ.11,050 కోట్లు నేరుగా జమ చేశామని చెప్పారు. ఖరీఫ్, యాసంగి కలిపి 2025-26 సీజన్‌లో రైతు చెల్లింపులు, కొనుగోలు ఖర్చులు కలిపి రూ.39,300 కోట్లకు పైగా వ్యయం జరుగుతోందన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో తడిసిన 10,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రత్యేక చర్యల ద్వారా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి రైతులకు నష్టం కలగకుండా ఎంఎస్పీ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న ఈ ధాన్యం కొనుగోలు కార్యక్రమం దేశ చరిత్రలోనే అతిపెద్ద స్థాయిలో జరుగుతోందని, రైతు బజార్లకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేసే వరకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు రాజకీయ ప్రేరేపితమని మండిపడ్డారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 30, ప్రతినిధి: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ, ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, మే 25 వరకు మొత్తం 45,357 దరఖాస్తులు అందాయని, అందులో MPC గ్రూప్‌కు 21,447, BiPCకు 17,400, MEC, CEC, HEC గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైందన్నారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. MPCలో 8,440 సీట్లకు 8,156, BiPCలో 8,280కు 7,425, MECలో 520కు 377, CECలో 1,520కు 1,500, HECలో 280కు 257, వొకేషనల్ కోర్సుల్లో 700కు 686 సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. మొత్తం అన్ని గ్రూపుల్లో 93.21 శాతం సీట్లు భర్తీ అయినట్లు వెల్లడించారు. ఫేజ్-1లో ఎంపికైన విద్యార్థులు జూన్ 7లోపు సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని, జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభమవుతున్నందున మొదటి రోజే హాజరుకావాలని మంత్రి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సోషల్ వెల్ఫేర్ గురుకులాలు జాతీయ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని, JEE Main-2026లో 337 మంది విద్యార్థులు అర్హత సాధించగా 26 మంది 90 శాతం పైగా పర్సంటైల్ సాధించారని తెలిపారు. గత ఏడాది 525 మంది JEE Advancedకు అర్హత సాధించడం గురుకుల విద్యా వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. IIT-JEE, NEET, NDA, CLAT వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలు కార్పొరేట్ కళాశాలలకు పోటీగా నిలుస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మైక్రో అకడమిక్ ప్లానింగ్, మాక్ టెస్టులు, ప్రత్యేక శిక్షణ, మానసిక దృఢత్వం, కౌన్సెలింగ్ కార్యక్రమాల వల్ల ఫలితాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. గురుకులాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు లేకుండా ప్రతి నెల మొదటి వారంలోనే చెల్లింపులు చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఇకపై ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి సూచనలు స్వీకరిస్తామని మంత్రి వెల్లడించారు. విద్యతోనే సామాజిక అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం విశ్వసిస్తోందని, పేద కుటుంబాల పిల్లలను దేశ భవిష్యత్ శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ ప్రభుత్వం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 30, ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి నిరూపితమైంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు తొలి విడతగా రూ.2,000 కోట్ల బకాయిలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను 100 రోజుల్లో రూ.6,000 కోట్ల మేర విడుదల చేస్తామని ప్రభుత్వం ఉద్యోగ జేఏసీ నాయకులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విడుదల చేసిన తొలి విడత నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను పూర్తిగా క్లియర్ చేయడంతో పాటు, మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని అధికారులు తెలిపారు. మిగిలిన రూ.4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతోందన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ, వేగవంతమైన నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



## దేవాలయాల నిర్మాణానికి సంపూర్ణ సహకారం: మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 30, బి డేవిడ్: పెద్ద కంజర్ల గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి, బీరప్ప స్వామి దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే దేవాలయ నిర్మాణానికి రూ.10 లక్షలు అందించామని, మరో రూ.40 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఐనోల్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. గ్రామంలోని సమస్యలను ప్రత్యేక నివేదిక రూపంలో అందించాలని ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులను కోరారు. గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## మంజీరా తీరం పై వెలసిన మహిమగల శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి చరిత్ర



సందేశం టైమ్స్, మనూర్, మే 30, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారు ప్రాంతీయ ప్రజల ఆరాధ్య దైవంగా ప్రసిద్ధి చెందారు. గ్రామ దేవతగా భక్తుల పూజలను అందుకుంటూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సిద్ధు స్వామి తెలిపిన వివరాల ప్రకారం అమ్మవారి మహిమలు ఎంతో విశేషమైనవని భక్తులు విశ్వసిస్తున్నారు. పూర్వకాలంలో గ్రామ ప్రజలకు వ్యాధులు, కష్టాలు, ప్రకృతి విపత్తులు అధికంగా సంభవించేవని, ఆ సమయంలో గ్రామ పెద్దలకు అమ్మవారు స్వప్నంలో దర్శనమిచ్చి తనను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తే గ్రామానికి శాంతి, సుభిక్షం కలుగుతాయని ఆదేశించినట్లు చెబుతారు. అనంతరం గ్రామస్తులు మంజీరా నది తీరంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి అమ్మవారు "నల్లపోచమ్మ"గా ప్రసిద్ధి చెందారు. అమ్మవారికి ప్రతి సంవత్సరం నిర్వహించే ఏడు వారాల జాతర మహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. కొందరు బోనాలు సమర్పిస్తే, మరికొందరు కోడెలు, పాలు, కొబ్బరికాయలు సమర్పిస్తూ అమ్మవారిని దర్శించుకుంటారు. జాతర సమయంలో ప్రత్యేక పూజలు, అక్షింతలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. భక్తులు అమ్మవారిని కోరుకున్న కోరికలు నెరవేరుస్తుందని విశ్వసిస్తూ కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా సంతానం, ఆరోగ్యం, పంటల అభివృద్ధి, కుటుంబ శాంతి కోసం మొక్కులు పెట్టుకుంటారు. మంజీరా నది తీరంలోని ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను మరింత ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి గ్రామ ప్రజలు, దాతలు, యువకులు కలిసి సహకరిస్తూ ఆలయ ఖ్యాతిని మరింత విస్తరింపజేస్తున్నారు. శ్రీ నల్లపోచమ్మ అమ్మవారు భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా నిలిచారని భక్తులు విశ్వసిస్తున్నారు.


## న్యాల్కల్‌లో జొన్నల కొనుగోళ్లు జోరు.. రైతుల్లో ఆనందం





సందేశం టైమ్స్, న్యాల్కల్, మే 30, ప్రతినిధి: జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్కల్ మండలంలో జొన్నల కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 21న ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలకు రైతులు పెద్ద ఎత్తున జొన్నలను తరలిస్తూ విక్రయిస్తున్నారు. న్యాల్కల్ డీసీఎంఎస్, హద్నూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ప్రతిరోజూ వందలాది క్వింటాళ్ల జొన్నలను సేకరిస్తుండగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు న్యాల్కల్ డీసీఎంఎస్‌లో 3,242 క్వింటాళ్లు, హద్నూర్ పీఏసీఎస్‌లో 2,300 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు ఆయా సంస్థల చైర్మన్లు సిద్ధి లింగయ్యస్వామి, జగన్నాథ్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం కల్పించిన కొనుగోలు సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. మంచి దిగుబడులతో పాటు కొనుగోళ్లు వేగంగా కొనసాగుతుండటంతో మండల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## న్యాల్కల్ తండా వద్ద అక్రమ ఎర్రరాయి రవాణా భగ్నం.. 400 ఎర్రరాళ్లతో లారీ సీజ్




సందేశం టైమ్స్, న్యాల్కల్, మే 30, మండల ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని న్యాల్కల్ మండలంలో అక్రమ ఎర్రరాయి రవాణాపై హద్నూర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. న్యాల్కల్ తండా సమీపంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో సుమారు 400 ఎర్రరాళ్లను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణలోకి ఎర్రరాళ్లను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన లారీని అడ్డగించి పరిశీలించగా రవాణాకు సంబంధించిన చట్టబద్ధ పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఘటనలో లారీ డ్రైవర్ రాథోడ్ శ్రావణ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఖనిజ రవాణా, సహజ వనరుల దోపిడీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హద్నూర్ ఎస్సై దోమ సుజిత్ హెచ్చరించారు. జిల్లాలో అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## ఎలాంటి గొడవలు చేసిన కఠిన చర్యలు తప్పవు: జోగిపేట ఎస్సై పాండు



సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 30, ఇన్‌చార్జి ప్రతినిధి: అందోల్ మండలంలోని సంగుపేట గ్రామ అండర్‌పాస్ బ్రిడ్జి సమీపంలో ఆరుగురు వ్యక్తులు గొడవకు దిగుతూ న్యూసెన్స్ సృష్టించిన ఘటనపై జోగిపేట పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించిన పోలీసులు బంటు వంశీకృష్ణ, మన్నే అనిల్, పెద్దాపురం విష్ణు, అలాగే రెండో వర్గానికి చెందిన ముద్దాసి హైమద్, మహమ్మద్ అబ్దుల్, మహమ్మద్ అస్లాంలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి గొడవలు పునరావృతం కాకుండా ఉండేందుకు యువకులు, వారి తల్లిదండ్రుల మధ్య కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 29న తహసీల్దార్ మధుకర్ రెడ్డి సమక్షంలో బైండోవర్ చేసి హాజరు పరిచినట్లు వెల్లడించారు. ఇకపై ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎలాంటి గొడవలు, న్యూసెన్స్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మధుకర్ రెడ్డి, జోగిపేట ఎస్సై పాండు హెచ్చరించారు.



## సంగారెడ్డి టీఆర్ఎస్‌లో యువత చేరికలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 30, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలో టీఆర్ఎస్ పార్టీలోకి యువత భారీగా చేరారు. జిల్లా నాయకుల సమక్షంలో పలువురు యువకులు పార్టీ కండువాలు కప్పుకొని టీఆర్ఎస్ పార్టీలో అధికారికంగా చేరారు. యువత రాష్ట్ర అభివృద్ధి, సీఎం నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ పార్టీలో చేరడం ఆనందదాయకమని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

## వడ్ల కుప్పపై పడి యువకుడి మృతి



సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని ఇసోజిపేట గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకున్న విషాద ఘటన గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన జైసింగ్ (35) అనే యువకుడు వడ్ల కుప్పపై పడుకుని ఉండగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా పోస్టుమార్టం నివేదిక అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. గ్రామంలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.




## సంగారెడ్డి జిల్లాలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 30, ప్రతినిధి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని సంగారెడ్డి జిల్లా పట్టణంలోని సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సంఘం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వై. అశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచందర్, నాయకులు సంజీవయ్య, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీవోఏల సమ్మెకు భారతీయ జనతా పార్టీ మద్దతు



సందేశం టైమ్స్, చింతకాని, మే 30, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ గత పది రోజులుగా చింతకాని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మెకు భారతీయ జనతా పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొండా గోపి మాట్లాడుతూ వీవోఏల డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీవోఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, రూ.20 లక్షల వరకు సామాజిక ఆరోగ్య బీమా సౌకర్యం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, జీవో నెంబర్ 58లో సవరణలు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే వీవోఏల తరపున భవిష్యత్తులో కలెక్టరేట్ ముట్టడికి కూడా భారతీయ జనతా పార్టీ సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోరిపల్లి శ్రీను, బుర్ర శ్రీను, ప్రధాన కార్యదర్శులు గోద మంగయ్య, ఇమ్మడి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొండా వెంకన్న, అంజన సిద్ధార్థ, వేముల ఎల్లయ్య, పామర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు వేదికగా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: తెలంగాణలో మహిళా సాధికారతకు వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తా సమీపంలోని గాంధీనగర్ ప్రాంతంలో తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఈఈ నరసింహులుతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనం తుది దశకు చేరుకుందని, మిగిలిన పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళల శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక వసతుల పనులను పరిశీలించిన కలెక్టర్ పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనలో ఈ భవనం కీలకంగా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో పంచాయతీరాజ్ ఈఈ నరసింహులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్






సందేశం టైమ్స్, ఖమ్మం, మే 30, ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అదనపు కలెక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మ్యాపింగ్ పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్‌వోల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలని తెలిపారు. మండలాలు, కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఓటరును మ్యాపింగ్ చేసే విధంగా వంద శాతం లక్ష్యంతో పనిచేయాలని పేర్కొన్నారు. జూన్ 24 నుంచి జూలై 25 వరకు ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి రికార్డులను నవీకరించాలని తెలిపారు. ఓటర్లు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సరైన వివరాలు అందించాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్లను తొలగించే ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీల తొలగింపు ఎస్ఐఆర్ ద్వారా జరుగుతుందని చెప్పారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మందికి పైగా ఓటర్లు ఉన్నచో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి బీఎల్‌వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ముసాయిదా జాబితా విడుదల అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు దిశానిర్దేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ రాజేశ్వరీ, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 63,869 మంది రైతుల నుండి 2,97,719.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అలాగే 45,458 మంది రైతుల ఖాతాల్లో రూ.490.87 కోట్లను జమ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే 35 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తిచేసి మూసివేసినట్లు పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, ధాన్యం రవాణాకు అదనపు ట్రాక్టర్లు, లారీలు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే ఇసుక రవాణాకు ఉపయోగించే ట్రాక్టర్లను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలీలు, వాహనాలు సిద్ధంగా ఉంచి ధాన్యం నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా పర్యవేక్షించాలని తెలిపారు. రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల పనితీరుపై నిరంతరం అప్రమత్తంగా ఉండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున ఉదయం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రముఖులు, పుర ప్రముఖులు, అతిథులకు ఆహ్వాన పత్రాలు అందజేయాలని తెలిపారు. ప్రోటోకాల్ నిబంధనలను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, ఇతర అతిథుల కోసం ప్రత్యేక సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ ఏఓ యూనస్, డీపీఆర్వో రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# వాయిలసింగవరం పీఎస్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులకు శ్రీకారం



సందేశం టైమ్స్, అనంతగిరి, మే 30, ప్రతినిధి: అనంతగిరి మండలంలోని వాయిలసింగవరం గ్రామ పీఎస్ పాఠశాలకు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రీ ప్రైమరీ పాఠశాల మంజూరు కావడంతో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆమోదంతో వాయిలసింగవరం-1 ప్రాథమిక పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్నాయి. చిన్నారుల అభ్యాసానికి అనుకూలంగా ఆకర్షణీయమైన తరగతి గదులు, ఆట వస్తువులు, విద్యా సామగ్రి ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి. గ్రామీణ ప్రాంత చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన ఆవుల రాజిరెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి సేకరించిన ధాన్యానికి సరిపడ గోదాంలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీ, ఏఎంసీ గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే గోదాముల్లో నిల్వ చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. అందుబాటులో ఉన్న గోదాములను ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం నిల్వ, రవాణా, కొనుగోలు ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ, డీఎం, ఎంఆర్ఓ, సీఐ, మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్ 13వ వార్డులో రూ.1.10 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: నర్సాపూర్ పట్టణంలోని 13వ వార్డులో నగర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూ.1 కోటి 10 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరియు సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్, సునీత బాల్ రెడ్డి, పంబల లలిత బిక్షపతి, రవి, అంతారం సుధీర్, షేక్ హుస్సేన్, కొత్త శ్రీనివాస్, మేఘరాజ్, ధర్మారం, ఖదీర్, ప్రజాపతి, నయీమ్ బిగ్ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్నపేట మండలంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: పాపన్నపేట మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 104 మంది లబ్ధిదారులకు రూ.1,04,12,064 విలువైన చెక్కులను అందజేశారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించి వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి





సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్–2026)ను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష చేపట్టారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఎలక్షన్ సూపరింటెండెంట్ గఫార్, తహశీల్దార్లు, ఆర్ఐలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగంలోకి రావాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 30, ప్రతినిధి: యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. జాతీయ ఎస్సీ, ఎస్టీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా, దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కల్పిస్తున్న రిజర్వేషన్లు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో ముందుకు రావాలని సూచించారు. వ్యాపార కేంద్రాలు, పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేసుకోవాలి, నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువతకు సరైన అవగాహన అవసరమని తెలిపారు. విజయవంతమైన పారిశ్రామికవేత్తల అనుభవాల నుంచి స్ఫూర్తి పొందడంతో పాటు వైఫల్యాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదిగ ఇండస్ట్రియల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు తక్కిళ్ళ విప్లవ గాంధీ, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, ప్రచార కార్యదర్శి ఉమాపతి, కోశాధికారి శ్రీనివాసరాజు, డైరెక్టర్ దుబ్బా నాగేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామానంద చటర్జీ 161వ జయంతి వేడుకలు







సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, మే 30, ప్రతినిధి: మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లిలో భారతదేశ తొలి పాత్రికేయుడు రామానంద చటర్జీ పేరుతో ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్‌లో ఆయన 161వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ నిర్వాహకులు నాగరాజు చారి, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ తొలి జర్నలిస్టుగా రామానంద చటర్జీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, జర్నలిజానికి అర్థం, రూపు, దిశ చూపిన మహనీయుడని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం నింపడంలో ఆయన పాత్ర విశేషమని తెలిపారు. చటర్జీ పేరుతో దేశంలోనే తొలిసారిగా కౌడిపల్లిలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు నాగరాజు చారిని అభినందించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీరారెడ్డి మాట్లాడుతూ రామానంద చటర్జీ బ్రిటిష్ పాలనను తన రచనల ద్వారా ఎదుర్కొన్న మహోన్నత జర్నలిస్టు అని పేర్కొన్నారు. ఆయన రచించిన "ప్రవాసి", "ది మోడర్న్ రివ్యూ" వంటి పత్రికలు దేశ ప్రజల్లో చైతన్యం నింపాయని తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కాజీపేట రాజేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులకు చటర్జీ తన రచనల ద్వారా మద్దతు అందించారని అన్నారు. ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండీ కొండోజు నరసింహ చారి మాట్లాడుతూ ప్రజా సేవలో ముందుంటున్న వ్యక్తులను గుర్తించి పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం నర్సాపూర్ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామిరెడ్డి రఘువీరారెడ్డి, ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండీ కొండోజు నరసింహ చారిలకు ఉత్తమ సేవా పురస్కార అవార్డులు అందజేశారు. అలాగే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ నిర్వాహకులు నాగరాజు చారిని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, రఘువీరారెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బొడ్ల నవీన్ గుప్తా, అల్మైపేట్ ఎల్లం, పోల నవీన్, రాజీవ్ రెడ్డి, శివానందరెడ్డి, రామ గౌడ్, కవిత అమర్ సింగ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు హైమద్, సందీప్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ జగన్, కృష్ణ పటేల్, ప్రమోద్, రమేష్, జర్నలిస్టులు శ్రీశైలం, జమీర్, సత్యనారాయణ, వినోద్, రవికుమార్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 30, ప్రతినిధి: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చివ్వెంల మండలం వలభాపురం గ్రామంలోని జగన్మాత పారా బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేయాలని, ధాన్యం దిగుమతిలో మిల్లర్లు ఎలాంటి జాప్యం చేయరాదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను సమర్థవంతంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల తహసీల్దార్ చంద్రశేఖర్, రైస్ మిల్ యజమాని జగన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి: సి. సుధర్శన్ రెడ్డి

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 30, ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐఆర్–2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఎలక్షన్ సూపరింటెండెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 30, ప్రతినిధి: పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ప్రాణ రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ జిల్లాను 'సున్నా ప్రమాదాలు' లక్ష్యంగా సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లాలో పారిశ్రామిక ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్' ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా స్థాయి అధికారులు, ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు, వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మేజర్ యాక్సిడెంట్ హజార్డ్ ఫ్యాక్టరీలు తమ సంస్థల పరిధిలో అమలు చేస్తున్న ఆన్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్లను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ స్పందన అందేలా పరిశ్రమలు, జిల్లా యంత్రాంగం, ఫైర్ సర్వీసులు, పోలీసులు, వైద్య, రవాణా శాఖల మధ్య సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు పరస్పర సహకారంతో బాధ్యతాయుతంగా పనిచేసి సూర్యాపేటను ప్రమాదాలు లేని సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఫైర్ శాఖ డీఎఫ్ఓ, రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.వి. శ్రీదేవి, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట: ముత్తినేని వీరయ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 30, ప్రతినిధి: దివ్యాంగుల సంక్షేమం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డితో కలిసి దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్‌చైర్లు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, స్వయం ఆధారిత జీవనం కోసం అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకొస్తోందని ముత్తినేని వీరయ్య తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలను సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ పట్టుదల, మనోధైర్యం ఉంటే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం జిల్లా సంక్షేమ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.